క్లుప్తంగా

సకాలంలో చెల్లించిన వారికి రుణాలు

రోలుగుంట: తమ బ్యాంకులో రుణాలు తీసుకొని క్రమపద్ధతిలో చెల్లించే స్వయం సహాయక సంఘాల సభ్యులకు సత్వరమే రుణాలు పునరుద్ధరిస్తామని స్థానిక ఏపీజీవీబీ మేనేజర్ పి. మహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం బ్యాంకు ఆవరణలో గ్రామ స్థాయి వెలుగు వీవోఏలతో ఆయన సమావేశమయ్యారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలు అందించామని, వాటిని ప్రతి నెలా చెల్లించేటట్లు వీవోఏలు సహకరించాలన్నారు. సమావేశంలో ఏపీఎంవో ఉష, ప్రాంతీయ సమన్వయకర్త కనకదుర్గ పాల్గొన్నారు.

ఎం. కోడూరు మోదమాంబకు విరాళం



సర్పంచ్‌కు విరాళం అందజేస్తున్న శ్రీనివాస్

మాడుగుల రూరల్: ఎం. కోడూరు మోదమాంబ ఆలయానికి స్థానిక భక్తులు మల్లిపాటి శ్రీనివాసరావు, లక్ష్మి కుటుంబ సభ్యులు రూ.5 వేల విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని శుక్రవారం వారు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందజేశారు. కార్యక్రమంలో పడాల అప్పలనాయుడు, చిరంజీవి, కృష్ణమూర్తినాయుడు, చల్లా నాగేశ్వరరావు, మూర్తి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన స్పీకర్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: ఏపీఎన్జీవో వారు రూపొందించిన క్యాలెండర్‌ను స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ శ్రీను, కార్యదర్శి రమణబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ కృష్ణ, రామచంద్ర పాల్గొన్నారు.

మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల ఆందోళన



గునుపూడి పీహెచ్‌సీ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సిబ్బంది

నాతవరం: తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గునుపూడి పీహెచ్‌సీ వద్ద తొలగింపునకు గురైన మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఇటీవల ప్రభుత్వం వీరిని విధుల నుంచి తొలగించిన నేపథ్యంలో శుక్రవారం గునుపూడి, నాతవరం పీహెచ్‌సీల వద్ద ఆందోళన చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందిని కలిసి మద్దతు పలకాలని కోరారు. మధ్యాహ్న భోజన విరామం సమయంలో వైద్యాధికారులు, ఇతర ఉద్యోగులు వీరికి సంఘీభావం ప్రకటించారు. సిబ్బంది కొరత కారణంగా ఆశించిన విధంగా రోగులకు వైద్య సేవలు అందించాలంటే, వెంటనే మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని వైద్యాధికారి గాడి అనూష కోరారు.

28 నుంచి ఏపీజీవీబీ సేవలకు అంతరాయం

మాడుగుల రూరల్: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు సేవలకు ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు అంతరాయం వల్ల లావాదేవీలు జరగవని కె.జె.పురం బ్రాంచి మేనేజర్ ఎం. రమేష్ శుక్రవారం తెలిపారు. ఏపీజీవీబీ ప్రధాన కార్యాలయం వరంగల్ నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కార్యకలాపాలు విభజిస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల పాటు బ్యాంకు సేవలు, ఆన్‌లైన్ నగదు లావాదేవీలు, ఏటీఎం కార్డులు పని చేయవని, వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి యథావిధిగా లావాదేవీలు పనిచేస్తాయని పేర్కొన్నారు. ఖాతాదారులు గమనించాలని కోరారు.



బుచ్చెయ్యపేటలో కోసిన వరి పనల్లో చేరిన వర్షం నీరు

ప్రకృతి ప్రకోపానికి గురైన అన్నదాతకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆరుగాలం కష్టించి పండించిన వరి పంట చేతికంది వచ్చిందన్న ఆనందం ఏ కోశానా కానరాలేదు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో పూర్తిగా తడిచి ముద్దవ్వడంతో నిస్సహాయ స్థితి వ్యక్తం చేస్తున్నాడు.



బుచ్చెయ్యపేట మండలం చిన అప్పనపాలెంలో తడిచిన వరి పనలను చూపుతున్న రైతులు



అన్నదాత ఆక్రోశం


- వర్షాలకు తడిసిన వరి పంట
- ధాన్యం రంగు మారి మొలకెత్తుతుందని ఆందోళన
- తీవ్రంగా నష్టపోయిన రైతులు



వీరనారాయణంలో తడిసిన పంటను పరిశీలిస్తున్న ఏవో వాసుదేవరావు

బుచ్చెయ్యపేట: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వరి పంట తడిసి ముద్దయింది. పొలాల్లో కోసిన వరి పనలు, ఆరబెట్టిన ధాన్యం తడిచి పోయింది. ఈ వర్షం రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. బుచ్చెయ్యపేట, వడ్డాది, లూలూరు, లోపూడి, చినఅప్పనపాలెం, తదితర గ్రామాల్లో వరి పనులు పూర్తిగా తడిచిపోయాయి. ఆరబెట్టిన వరి పనలు చుట్టూ వర్షం నీరు చేరింది. నాల్గు రోజులుగా నీటిలో ధాన్యం నానిపోవడంతో మొలకెత్తి తీవ్రంగా నష్టం జరుగుతుందని వాపోతున్నారు. నూర్చిన ధాన్యంలో 17 శాతం కన్నా తక్కువ తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పడంతో రైతులు పొలాల్లో ఆరబెట్టారు. అకస్మాత్తుగా కురిసిన వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడిచి ముద్దయ్యాయి. దీంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి పొలాల్లో చేరిన నీరు బయటకు పోయేలా కాలువలు తీసి, ధాన్యం మొలకెత్తకుండా ఉప్పు నీరు ద్రావణం జల్లి పంటను కాపాడుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. టార్పాలిన్లు ఉచితంగా అందిస్తామని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నా మండలంలో ఒక్క రైతుకు ఇచ్చిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

మాడుగుల రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు కోసిన వరి పంట పూర్తిగా తడిసి పోయింది. 50 శాతం మేర వరి పంట కోసి ఒడ్డుకు చేర్చి కుప్పలుగా పెట్టగా, మరో 50 శాతం రైతులు గత వారంలో కోశారు. తుఫాన్ హెచ్చరికలతో ఈ నెల 17 నుంచి కొంత మంది రైతులు ఆదరాబాదరాగా పొలాల్లో కుప్పలు పెట్టారు. మరికొందరు అతి కష్టం మీద ఒడ్డుకు చేర్చి కుప్పలు పెట్టారు. వ్యవసాయ కూలీలు డిమాండ్‌తో తీవ్ర అవస్థలకు గురయ్యారు. ప్రస్తుతం పొలాల్లో తడిసిన పంట చూసి రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తడిసిపోయిన పంటను ఆయా గ్రామాల్లో గ్రామ రైతు సేవా కేంద్రాలు వీఏఏలు, వీహెచ్ఏలు క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలించారు. వీరనారాయణం, జంపెన, తదితర గ్రామాల్లో తడిసి ముద్దయిన వరి పంటను మండల వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావు పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 11 వేల ఎకరాల్లో వరి వేశారని, దీనిలో 80 శాతం మేర కోతలు కోశారన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత తడిసిన పనలుపై లీటరు నీటికి 50 గ్రాములు కల్లు ఉప్పు కలిపి పిచికారీ చేయాలన్నారు. దీని వల్ల ధాన్యం మొలకెత్తకుండా రంగు మారకుండా కాపాడుకోవచ్చునని సూచించారు.



మాడుగుల మండలం సత్యవరం గ్రామంలో తడుస్తున్న వరి పనలు



వర్షపునీటి తొలగించేందుకు కాలువ ఏర్పాటు చేస్తున్న రైతు



గొలుగొండలో తడిచిన పంటను ఒడ్డుకు చేర్చుతున్న రైతులు

మాడుగుల: మూడు రోజులు నుంచి కురుస్తున్న వర్షాలకు కోసిన వరి పనలు తడసి ముద్దవుతుండడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. సత్యవరం, జేడీపేట, గాదిరాయి, ఒమ్మలి, కింతలి, ఎం. కోడూరు, మాడుగుల, తదితర గ్రామాల్లో 50 ఎకరాల్లో కోసిన వరి చేలు తడిసిపోయాయి. దీంతో ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

మాకవరపాలెం: మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 1,410 హెక్టార్లలో వరి సాగు చేశారు. ఇప్పటికే వెయ్యి హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి. రెండు రోజుల క్రితం కోసిన వరి పనలు ఇంకా పొలాల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి వరి పనలు తడిసి ముద్దయ్యాయి. దీంతో చేతికందే సమయంలో పంట నష్ట పోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షానికి సుమారు 150 ఎకరాల్లో పంట తడిసిపోయినట్టు అంచనా వేస్తున్నారు. ధాన్యం మొలకలు రాకుండా ఉప్పు ద్రావణాన్ని వరి పనలపై చల్లాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

రోలుగుంట: వచ్చే మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏవో ఎస్. విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు ఆమె పలు సూచనలు చేశారు. పొలంలో నీరు నిల్వ ఉండకుండా బయటకు వెళ్లేటట్లు చిన్నపాయలు తీసుకోవాలన్నారు. కోత కోసిన పొలంలో వరి పనలు వర్షానికి తడిసినట్లయితే గింజ మొలకెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 5 శాతం ఉప్పు ద్రావణాన్ని ప్రతి లీటరు నీటికి 50 గ్రాములు చొప్పున కల్లు ఉప్పు కలుపుకుని 2, 3 సార్లు వరి పనలపై పడే విధంగా పిచికారీ చెయ్యాలన్నారు. ఒక వేళ పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే వరి పనలను గట్లుపై తీసుకొచ్చి వేరు చేసి ఉప్పు ద్రావణం చల్లుకోవాలన్నారు. వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలు తిరగేసి ఎండబెట్టి నూర్పు చేసుకోవాలని సూచించారు.

గొలుగొండ: తుఫాన్ ప్రభావంతో మండలంలో 800 ఎకరాల్లో వరి పంట తడిచిపోయింది. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట పండిస్తే కోసిన తర్వాత తడిచిపోయి నష్టపోయామని రైతులు వాపోతున్నారు. కోసిన పంటను కాపాడుకునే పనుల్లో బిజీబిజీగా ఉన్నారు.

కె.కోటపాడు: అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా పడుతున్న వర్షాలకు వరి పంట పూర్తిగా తడిచిపోయింది. కోతలు చేసిన వరిపంటను ఆరబెట్టేందుకు పొలాల్లోనే ఉంచారు. తీరా అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురవడంతో కొందరు రైతులు తాత్కాలికంగా మడుల్లోనే కుప్పలు ఏర్పాటు చేసుకోగా, ఆరని పంటను పొలాల్లోనే ఉంచారు. దీంతో ఈ పంట ప్రస్తుతం నీటిలో మునిగి ఉంది. పొలంలో వర్షపునీటి బయటకు వెళ్లేందుకు చిన్న పాటి కాలువలు ఏర్పాటు చేస్తున్నారు. వర్షాలు మరో రెండు రోజుల పాటు ఇదేవిధంగా పడితే ధాన్యం పాడవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలలుగా ఎన్నో వ్యయ ప్రయాసలతో పంటను పండిస్తే తుపాను వర్షాలతో నీట మునగడంతో విచారం వ్యక్తం చేస్తున్నారు. తడిచిన వరి పంటను పరిశీలించి నష్టపరిహారం అందించాలని కె.కోటపాడు, సింగన్నదొరపాలెం, సూర్రెడ్డిపాలెం, గవరపాలెం, కె.జె.పురం, ఎ.కోడూరు, పాడుగుపాలెం గ్రామాల రైతులు కోరుతున్నారు.

విద్యార్థినులకు బహుమతులు ప్రదానం



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న డీఈఈ గౌరీప్రసాదు

చోడవరం: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల నర్సాపురం కేజీబీవీలో విద్యార్థినులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు శుక్రవారం స్థానిక పాఠశాలలో ప్రిన్సిపాల్ వై. సంధ్య, చోడవరం విద్యుత్ డీఈఈ కుమార్ గౌరీప్రసాదు, రూరల్ ఏఈ టి. ఉదయ్ కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. వ్యాసరచనలో ఎ. సుప్రజ (9వ తరగతి), ఎన్. జాహ్నవి (8వ తరగతి), ఎస్. సమత (7వ తరగతి), చిత్రలేఖనంలో కె.యామిని (10వ తరగతి), ఎస్. కృతికా (9వ తరగతి), జి. శ్యామ్ సుందర్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. సిబ్బంది తాతబాబు, యుగంధర్, ప్రసాద్, కిరణ్‌సాయి పాల్గొన్నారు.

ట్రాలీపై నుంచి రోడ్డుపై పడిన గ్రానైట్ రాయి

- కేజీ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం



కేజీ రోడ్డులో పడ్డ గ్రానైట్ రాయి

బుచ్చెయ్యపేట: మండలంలో కొంకోట, బంగారుమెట్ట(కేజీ) రోడ్డులో ట్రాలీపై నుంచి 20 టన్నుల బరువున్న గ్రానైట్ రాయి పడిపోయింది. శుక్రవారం రాత్రి రావికమతం నుంచి అనకాపల్లి వైపు ట్రాలీపై తరలిస్తుండగా, రాజాం వెదుళ్లగెడ్డ బ్రిడ్జి వద్ద పడటంతో రోడ్డు ధ్వంసమైంది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రాజాం బ్రిడ్జికి రెండు వైపులా రెండు కిలోమీటర్ల దూరం వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. భారీ క్రేన్‌ను తీసుకొచ్చి పడిపోయిన రాయిని ట్రాలీపైకి ఎక్కించారు. వర్షంతో రాత్రి సమయంలో పలువురు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తరుచూ ట్రాలీపై నుంచి గ్రానైట్ రాళ్లు పడుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



క్రేన్ సహాయంతో ట్రాలీపైకి ఎక్కిస్తున్న రాయి

నేడు జగనన్న జన్మదిన వేడుకలు



మాడుగులలో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎంపీపీ వెంకట రాజారామ్

- నర్సీపట్నంలో మెగా రక్తదాన శిబిరం



మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శుక్రవారం తెలిపారు. జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని 14 ఏళ్లుగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, విద్యార్థులు పాల్గొని రక్తదానం చేయాలన్నారు.

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, రైతులు, యువకులు పాల్గొనాలన్నారు. ఆయా గ్రామాల్లో పలు సేవా క్యాక్రమాలు చేయాలన్నారు.

మాడుగుల/దేవరాపల్లి/చీడికాడ/కె.కోటపాడు: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు విజయవంతం చేయాలని ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, బూరె బాబూరావు కోరారు. ఈ మేరకు మాడుగుల మండలం ఘాట్‌రోడ్ జంక్షన్‌లోనూ దేవరాపల్లిలో పార్టీ నాయకుడు వరదపురెడ్డి లలితానాయుడు నివాసంలోనూ కె.కోటపాడు మండలం చౌడువాడలోనూ చీడికాడలో వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మాడుగుల నియోజకవర్గ కన్వీనర్ ఈర్లె అనురాధ హాజరు కానున్నారని తెలిపారు.

ప్రభుత్వ భూమిపై భూస్వామి కన్ను



సగం కటింగ్ చేయడంతో కూలేందుకు సిద్ధంగా..



చెట్టుకు ఆనుకున్న 33 కె.వి. విద్యుత్ లైను

నాతవరం: భారీ వృక్షాన్ని సగం వరకు నరికి వదిలేయడంతో ప్రమాదం పొంచి ఉంది. మండలంలో మర్రిపాలెం పంచాయతీ శివారు యాళ్లవారు గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని భారీ వృక్షం ఉంది. దీని చుట్టూ 25 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో కొంత భాగాన్ని యాళ్లవారు గ్రామస్తులు పూర్వం నుంచి శ్మశాన వాటికగా ఉపయోగించుకుంటున్నారు. ఈ భూమి తాండవ జంక్షన్ నుంచి మండల కేంద్రానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని ఉంది. ఇటీవల మండల కేంద్రానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా భూములకు ఊహించని విధంగా ధరలు పెరిగాయి. రోడ్డును ఆనుకుని ఉన్న భారీ వృక్షం ఉన్న ప్రభుత్వ భూమిపై ఓ భూస్వామి కన్నుపడింది. చెట్టు వెనుక భాగంలో తన జిరాయితీ భూమిలో కలిపేసేందుకు ప్రభుత్వ భూమి ఆక్రమణకు ప్రయత్నం చేశాడు. ఈ నేపథ్యంలో భారీ వృక్షాన్ని తొలగించేందుకు గుట్టుచప్పుడు కాకుండా కటింగ్ చేస్తుండగా, యాళ్లవారు గ్రామస్తులు మూకుమ్మడిగా వెళ్లి అడ్డుకున్నారు. అప్పటికే భారీ వృక్షం 80 శాతం పైగా కటింగ్ చేసేయడంతో కూలేందుకు సిద్ధంగా ఉంది. చెట్టును ఆనుకుని నాతవరం వెళ్లే 33 కె.వి. విద్యుత్ లైను ఉంది. ఈదురుగాలులకు సగం కటింగ్ చేసి ఉన్న భారీ వృక్షం ఊగుతూ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులను భయపెడుతోంది. చెట్టు కూలితే విద్యుత్ తీగలపై పడి పెను ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

పొంగి ప్రవహిస్తున్న నదులు



తారకరామ జలాశయంలో చేరిన వర్షపు నీరు

మాడుగుల రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తాచేరు, శారదానది, పాలగెడ్డ, చింతగెడ్డ పొంగి ప్రవహిస్తున్నాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు చెరువుల్లో నీరు చేరింది. తాచేరు నదిలో నీరు చేరడంతో పొంగి పొర్లుతోంది. గురువారం అర్ధరాత్రి నుంచి ఏకధాటిగా వర్షాలు కురవడంతో చెరువులు, కాలువలు ద్వారా నీరు ప్రవహిస్తోంది. దీంతో పాటు ఉరకగెడ్డ, తారకరామ జలాశయాల్లో పుష్కలంగా నీరు చేరింది.



కె.జె.పురం వద్ద తాచేరు నదిలో ప్రవహిస్తున్న నీరు

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం



పి.పి.అగ్రహారంలో మాట్లాడుతున్న తహసీల్దారు రమాదేవి

కె.కోటపాడు: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనున్నట్లు తహసీల్దార్ వి.భాగ్యవతి తెలిపారు. శుక్రవారం పోతనవలస సదస్సులో ఆమె 9 మంది నుంచి అర్జీలను స్వీకరించారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ సమస్యలకు పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. సర్పంచ్ చిరికి భార్గవి, సర్వేయర్ రామచంద్రమూర్తి, వీఆర్వో గంగునాయుడు పాల్గొన్నారు.



పోతనవలసలో అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ భాగ్యవతి

మాడుగుల రూరల్: మండలంలో భాగవతుల అగ్రహారం, పోతనపూడి అగ్రహారం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దారు కె. రమాదేవి హాజరై వచ్చిన అర్జీలను పరిష్కరిస్తామన్నారు. రీ సర్వే డీటీ గణపతిరావు, మండల సర్వేయరు జగదీష్, సర్పంచ్ కోరుకొండ భవానీ, సాంబమూర్తి, వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలో 38 మంది ఎంపిక

మాడుగుల: స్థానిక డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్, ఐక్యూసీ విభాగాల ఆధ్వర్యంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. నక్కపల్లి హెట్రో ల్యాబ్ లిమిటెడ్, క్రెడిట్ యాక్సిస్, గ్రామీణ లిమిటెడ్, వారు 52 మంది యువకులకు రాత పరీక్షలు నిర్వహించి 38 మందిని ఎంపిక చేశారు. వారికి ప్రిన్సిపాల్ సి.వి.ఎస్.ఎస్ శాస్త్రి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సైతం ఉద్యోగాలు వెతుక్కుంటూ వస్తున్నాయన్నారు. ఎంపికైన వారు తగిన నైపుణ్యం సంపాదించుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి. జయలక్ష్మి, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ ఎం. రాజుకుమార్, కంపెనీ ప్రతినిధులు లక్ష్మయ్య, రాజేష్ పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శాస్త్రి, కంపెనీ ప్రతినిధులు

రేపు బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

చోడవరం: గణేశ్ గాయిత్రీ బ్రాహ్మణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక భమిడిపాటి వారి వీధిలోని గాయిత్రీ బ్రాహ్మణ సేవా సంఘం భవనంలో ఈ నెల 22న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు ట్రస్టు గౌరవాధ్యక్షుడు కందర్ప కృష్ణమూర్తి (క్రిష్టప్ప) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ లక్ష్మీనారాయణ పరిణయ వేదిక, గాయిత్రీ బ్రాహ్మణ సేవా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదికనిర్వహిస్తామన్నారు. వివరాలకు 9440372490 సంప్రదించాలని కోరారు.

పురస్కారాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి: వ్యవసాయ శాస్త్రవేత్త దివంగత డాక్టర్ కె. రామలింగేశ్వరరావు పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొణతాల రామలింగేశ్వరస్వామి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు కొణతాల లక్ష్మీపార్వతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామి ఆశయ సాధనకు సేవా దృక్పథం గల వారిని తమ ట్రస్ట్ ద్వారా 2025 భోగి రోజున సత్కరిస్తామన్నారు. ఉత్తమ సమాజ సేవకులు, ఉత్తమ ఉపాధ్యాయులకు మొత్తం ఆరుగురికి ఇస్తామన్నారు. దరఖాస్తులను డాక్టర్ కొణతాల రామలింగేశ్వరస్వామి మెమోరియల్ ట్రస్ట్, డోర్ నంబర్ 12-118, చిన్నబాబు కాలనీ, తుమ్మపాల పంచాయతీ-531032, అనకాపల్లి మండలం, జిల్లా చిరునామాకు పంపించాలని తెలిపారు.